"ఏడ్వకండీ మనమేం చేస్తాం...అవున్లెండి మరి.. మనసులిచ్చేసుకోవడం ... పుచ్చుకోవడం అంటూ జరిగిపోయిన దరిమిలాను... ఇద్దర్లో ఏ ఒక్కరి కాపదలొచ్చినా...ఇద్దరికీ వచ్చినట్టే భావించి కలిసేడుస్తారు. పాపం ఆవిడకూడా ఆ వెధవనుంచి మీకే ఆపద మూడుతుందోనని నా సమక్షంలోనే పావుగంటసేపు నిర్విరామంగా ఏడ్చింది. దానిమీదే 'ఏడ్వకండి ఏం చేస్తాం ... అంతా విధివిలాసమే గదా...మనం నిమిత్తమాత్రులమే నాయె'...అని మెయిల్‌కి సిద్ధం కమ్మన్నానండి" ఆగాడప్పన్న.

"రైటో- మంచిపని చేశావ్ నీ ఋణంతీర్చుకోలేనప్పన్నా" అన్నాడు దాసుగారు చేతులు పట్టుకుంటూ.

"అయ్యో ఎంతమాట ... ఏదో తనుదయ!" చేతులు నలిపాడప్పన్న.

"అజ్ఞాతవాసానంతరం నీకు తగిన 'ఈనామే' ఇస్తా"లెమ్మని వాగ్దానం చేశాడు దాసుగారు.

సంపూర్ణ రామాయణం–లవకుశుల జననంతోనే ఆగిపోయింది. సీతా, వెంకన్నల వివాహం వైభవోపేతంగా జరిగిపోయింది.

మంగవేషంలోని మార్పుకు కారణం తెలిసిపోయాక కాసేపాడిపోసుకుని ఆశ్చర్యంనుంచి కోలుకున్నారు జనం అంతా. "రామాయణంలో–ప్రేమాయణం" అని గుడి గోడమీద కొంటె పిల్లలు చెక్కిన అక్షరాలు మట్టుకు యింకా అలాగే ఉన్నాయి.

---

కథానిక

# గెలుపు ఎవరిది?

వై. రాధాకృష్ణమూర్తి

ఆఫీసుకు వెళ్ళటానికి తయారై "పార్వతీ?" అని యింట్లోకి కేకవేశాడు విశ్వనాథం; సమాధానం వంట యింట్లో గిన్నెలు, చెంబులు చెప్పాయి గాని పార్వతి మాత్రం పలకలేదు, బయటికిరాలేదు.

తిన్నగా విశ్వనాథమే వంటయింటిదాకా వెళ్ళి "నేను ఆఫీసుకు వెళ్తున్నా. సాయంత్రం వచ్చేటప్పుడు యేమైనా తీసుకురావాలా?" అన్నాడు.

"వెళ్ళండి. ఇంటికి నేను కాపలా కాస్తూ వుంటా. వచ్చేటప్పుడు రెండు గజాలు గట్టితాడు తీసుకురండి" వెధవ గిన్నెలు మళ్ళా గొడవచేశాయి.

"తాడెందుకు?" ఏమీ బోధపడక అడిగాడు విశ్వనాథం.

"మీ పీడా నా పీడా విరగడ చేసుకోవటానికి"

ఇక వాదన లాభం లేదని తిన్నగా బయటికొచ్చాడు విశ్వనాథం ఆఫీసుకు వెళ్తూ, ఆఫీసులోనూ, యిదే ఆలోచనైపోయింది. ఒకటే ప్రశ్నకు అతనికి సమాధానం దొరకటంలేదు.

"పార్వతికి కోపం రావటానికి కారణం యేమిటి?"

నిన్న రాత్రివరకూ బాగానేవున్న పార్వతి తెల్లవారేసరికి హఠాత్తుగా మారిపోయింది. తను నిద్రలేవటమే గాజు గ్లాసులు నేలమీద చేసిన చప్పుడుతో లేచాడు. అప్పటినుంచీ గమనిస్తున్నాడు. పార్వతి పూర్తిగా మారిపోయింది. ఒకటే రుసరుస.

"ఏమిటి పార్వతీ యీ గొడవంతా? అసలు కారణమేమిటి?" అనడిగాడు.

"అవును గొడవకాదూ మరి? నేను మీ జీవితానికే పెద్ద గొడవనై కూర్చున్నాను. అసలు కారణమేమిటంటే నేనింకా బతికి వుండటమే."

ఎంతసేపూ సంభాషణ యిదే పద్ధతిలో నడిచింది తప్ప ఆ రోజు వుదయంనుండీ యింట్లో క్షణం సేపు స్తిమితంగా లేదు. కారణం విశ్వనాథానికి తెలియదు. పార్వతి చెప్పదు.

తమ రెండేళ్ళ కాపరాన్నీ ఒక్కసారి సింహావలోకనం చేసుకున్నాడు విశ్వనాథం. ఇంతకుముందు కనీసం ఒక్కసారైనా తనకూ పార్వతికీ మధ్య పేచీరాలేదు. ఇప్పుడైనా పేచీ రావటానికి తనకేమీ కారణం కన్పించటంలేదు.

అయినా అంత పెద్ద కారణం లేనిదే పార్వతికి మాత్రం కోపమెందుకొస్తుంది? ఇంత మొండిగా ఎప్పుడూ లేదే! ఎంతసేపూ ఏదో తనమీదకసివున్నట్లు ప్రవర్తించటమే తప్ప కారణం తెలియనివ్వదు.

ఆలోచించి ఆలోచించి ఒక నిర్ణయానికొచ్చాడు విశ్వనాథం. ఏమైనా సరే తను మాత్రం తొందరపడకూడదు. ఆ అగ్నిపర్వత మేదో పేలేటంతవరకూ వేచివుండటమే మంచిది. తనను యేదో అపార్థం చేసుకుంది పార్వతి. కాని తను నచ్చచెపితే తప్పకుండా వింటుంది!

సాయంత్రం యింటికి వెళ్తూ అలవాటు ప్రకారం పూలు పట్టుకెళ్ళాడు. అతన్ని చూడగానే పార్వతి పెద్దపులిని చూసినట్లు చూసి యింట్లోకి వెళ్ళిపోయింది. అతనూ నేరుగా లోపలికెళ్ళాడు.

"పార్వతీ, పూలివిగో."

"అవతల పారెయ్యండి. నాకేమీ అక్కర్లేదు."

విశ్వనాథానికి ఆశ్చర్యం, కోపం వచ్చాయి. పూలు అవతల పారెయ్యమంటుందా? ఈ సుకుమారిలో యింత క్రూరత్వం వున్న సంగతి తను యిన్నాళ్ళుగా గ్రహించకుండా యెలావున్నాడు? తను తెచ్చిన పూలు పెట్టుకోకపోతే తను యెంత బాధ పడతాడో పార్వతికి బాగా తెలుసు. అయినా మాట తూలింది.

మొత్తంమీద యేదో పెద్ద కథవుంది. తను తొందరపడితే రసాభాస అవటంతప్ప మరేమీ లాభం లేదని తగ్గిపోయాడు విశ్వనాథం.

"కాఫీ వుందా?"

"ఆ మణిఅయ్యర్ హోటల్లో ఉంటుంది" లోపల్నించి సమాధానం.

* * *

ఆ రోజంతా అలానే గడిచిపోయింది. మాటిమాటికీ విశ్వనాథాన్ని యెత్తిపొడవటం, కవ్వించటం చేస్తూనేవున్నది పార్వతి. ఈ వ్యవహారం యేమీ అర్థం కాకపోయినా అంతా సహించాడు ఆ మానవుడు.

మర్నాడు ఉదయాన్నే పెరట్లో ముఖం కడుక్కుంటున్న విశ్వనాథానికి యింట్లో యేమిటో గడబిడ వినపడి లోపలికొచ్చాడు: పార్వతే ఇంట్లో పెట్టెలతోనూ, గోడలతోనూ పోట్లాడుతున్నది. విశ్వనాథాన్ని చూడగానే టేబుల్ మీదవున్న ఒక పుస్తకాన్ని తీసి 'వెధవ పుస్తకాలు. అడ్డమైన చెత్తా యిక్కడే' అంటూ నేలమీదికి విసిరేసింది.

విశ్వనాథం పుస్తకాల్ని గాజుసామానులాగ జాగ్రత్తగా చూసుకుంటాడు. నలిగిన పుస్తకాలన్నా, పుస్తకాల్ని పాడుచేసేవాళ్ళన్నా అతనికి మంట.

అలా విశ్వనాథం బాధపడటానికి, కోపం తెచ్చుకోవటానికి యెలా వీలవుతుందని తోచిందో అన్ని మార్గాలూ తొక్కిచూసింది పార్వతి. కొన్నిసార్లు నిజంగా కోపం వచ్చింది విశ్వనాథానికి. కాని అతను ఒకటే నిర్ణయానికొచ్చేశాడు. కనీసం యింకొక రోజు పాటైనా తను పూర్తిగా మౌనవ్రతం అవలంబించటమే మార్గం. అసలు యీ అంతర్యుద్ధానికి కారణమేమిటో కూడా యీలోపల విచారించ దల్చుకోలేదు.

ఆర్రోజు ఆఫీసులోవున్న విశ్వనాథానికి రెండు గంటలకు తీవ్రంగా తలనొప్పి వొచ్చింది. ఇంటి గొడవలతో తల వేడెక్కిపోయింది. ఇహ ఆఫీసులో కూర్చొని పనిచెయ్యటం అసంభవం అనిపించగానే పర్మిషన్ తీసుకొని సరాసరి యింటికి వెళ్ళిపోయాడు. కనీసం తనస్థితి చూసైనా పార్వతి యుద్ధ విరమణచేస్తే, సంధి షరతుల్ని గురించి తర్వాత మాట్లాడుకోవచ్చు.

గుమ్మంలో అడుగుపెట్టిన విశ్వనాథానికి లోపల్నించి పకపకా నవ్వులు వినపడుతున్నై. తలనొప్పి సగం తగ్గిపోయింది ఆ దెబ్బతో. పార్వతి మళ్ళీ యిలా అయిపోవటానికి యీలోపల యేమి జరిగివుంటుంది? బ్రతికిపోయానురా బాబూ అనుకొంటూ వరండాలోవున్న కుర్చీలో కూలబడ్డాడు. అతను వచ్చిన సంగతి లోపల వాళ్ళకు తెలియదు. మళ్ళీ పార్వతి నవ్వటం వినిపించిందిగదా అని సంతోషంతో లోపలవాళ్ళ సంభాషణ చెడగొట్టటం యిష్టంలేక నిశ్శబ్దంగా కూర్చున్నాడు.

"మరి నువ్వు నవ్వకుండావుంటే సంగతంతా చెప్తా సీతా" లోపల్నించి పార్వతి గొంతుక వినిపించింది.

"ఛా, ఛా నవ్వట మెందుకు సంగతంతాచెప్పు" పొరుగింటి రామారావు భార్య సీత అడిగింది.

"మీకథా కమామీషు కానిచ్చి నా పందెం అయిదు రూపాయిలు మాత్రం నాకు పడెయ్..." పక్కయింటి సావిత్రి మాట వినపడ్డది.

ఈ ఉపోద్ఘాతంతో కుర్చీలో కూర్చున్న విశ్వనాథానికి ఒక్కసారి చైతన్యం వచ్చింది. బాబూ

కథ కామెడీయేగదా అని సంతోషంకొద్దీ శ్రద్ధగా వినటం మొదలెట్టాడు. పార్వతి చెప్తున్నది.

"మొన్న మధ్యాహ్నం సావిత్రీ, నేనూ పందెం వేసుకున్నాం."

"ఆ సంగతి తెలుస్తూనే వుంది. అసలు పందె మేమిటీ? ఎందుకేసుకున్నారూ?' దీర్ఘాలుతీస్తూ మిత్రలాభంలో జంతువులాగా అడిగింది సీత.

'అదే చెప్పటం' పార్వతి మళ్ళీ కథ సాగించింది. "మగవాళ్ళ . ఓర్పును గురించి మాటా మాటా వొచ్చింది మా యిద్దరికీ. నేనేమో 'ఆడవాళ్లు జాగ్రత్తగా సర్దుకుపోతూంటే మనవాళ్లు యెగ కబుర్లయినా చెప్తారు. కొంచెం చికాకుపరిచామా యిహ నిప్పులుతొక్కిన కోతుల్లాగా ఎగిరి చిందు లేస్తారు.' అన్నాను. సావిత్రేమో 'అందర్నీ అలా అనకూడదు. మగవాళ్ళలోనూ, ఆడవాళ్ళలోనూ కూడా ఓర్పు వున్నవాళ్ళూ, ఓర్పు తక్కువ వాళ్ళూ వుంటారు'. అంది."

"దాన్నిగురించి పందెమేమిటి నా మొహం? అందులో యేదో పెద్ద తగాదా వున్న పాయింటు న్నట్లు?" సీత మళ్ళీ అడిగింది.

"సరిపోయింది. అక్కడతో ఆగిందా మా సంభాషణ? మన యిళ్ళల్లో మగవాళ్ళనుగురించి వొచ్చింది ప్రస్తావన. బాగా ఓర్పు వున్నవాళ్లెవరు? 'అని."

"కొంపతీసి మా ఆయన్ని గాని ఓర్పువున్నవాళ్ళ జాబితాలో వెయ్యలేదుగదా?"

"నువ్వు విను, మధ్యలో గొడవలేకుండా. మీ ఆయన్ని అసలు ముందే లిస్టులోనించి తీసేశాం. సావిత్రి మొగుణ్ణి కూడా నెట్టేశాం. చివరికి మా దొరగారు మిగిలారు."

బయట కూర్చున్న విశ్వనాధానికి తను చదివిన అన్ని పుస్తకాల్లో వున్న కథలకంటే యిది బాగా యింటరెస్టింగ్‌గా వుంది. 'చివరకు నామీద యెక్స్‌పెరిమెంట్ చేశారన్నమాట!' అనుకున్నాడు.

పార్వతి చెప్పుకుపోతున్నది. "సావిత్రి మా వారిని గురించి, ఆయన ఓర్పును గురించి ఓ అర గంట లెక్చరిచ్చింది. మగవాళ్లు అలా వుండటానికి చాలావరకూ భార్యే కారణం' అంటాను నేను.

"చివరకు పందెంవేసుకునేదాకా వచ్చింది. నిన్నటినుంచి రెండురోజులు గడువు. ఆ లోపల ఆయనకు యెలాగైనా కోపంతెప్పించాలి. ఆయన నామీద యెలాగైనా చెయ్యి చేసుకునేలాగ చెయ్యాలి.

"నిన్నటినుంచి సర్వవిధాలా ప్రయత్నించా. ఆయన యే వస్తువుల్ని యిష్టంగా చూసుకుంటారో వాటినల్లా పాడుచేశాను. నిజం చెప్పొద్దూ ఒకటి రెండుసార్లు ఆయన్నే తిట్టాను కూడా. ఊహు, యేమీ లాభం లేకపోయింది. ఎంతసేపూ లోపల్లోపల బాధపడటమే గాని—దెబ్బ వెయ్యక పోతే పోనీ—నాలుగుతిట్లన్నా తిట్టలేదు. ఆయన్ని నేనేదో అర్థం చేసుకోని కంట్రోలు చేసుకొస్తున్నా అనుకున్నాగాని యింత గట్టిమనిషని అనుకోలేదు."

"మరి నా అయిదు రూపాయలూ పడెయ్ పార్వతీ" అంటున్నది సావిత్రి.

"రెండురోజులనుకున్నారుగా, గడువు పూర్తి కాకుండానే డబ్బు, డబ్బంటుందేం సావిత్రి?"

"నేనే చెప్పేశాను. నేను ఓడిపోయానని. మా రెండేళ్ళ కాపరంలోనూ ఒక్కనాడు కూడా యెరగం. అటువంటిది రెండురోజులపాటు యుద్ధ రంగంగా మారిపోయింది యిల్లు. అన్నం అంతా పట్టిచూడాలా? మనిషితత్వం తెలిసిపోలేదూ? ఇహం లాభంలేదు."

బయటకూర్చున్న విశ్వనాధానికి యీ వ్యవహారం అంతా వింటుంటే నవ్వాలో, కోపం తెచ్చుకోవాలో తెలియకుండా వుంది. ఇహ చాలురా బాబూ, యీ సీతమ్మవారి కష్టాలు ఏకరువు పెడుతూంది గాబోలు అనుకుంటూ మళ్ళీ నిశ్శబ్దంగా బజార్లో కొచ్చి పడ్డాడు.

ఆ పూటంతా యెక్కడ కూర్చున్నా విశ్వనాధానికి పార్వతి, సావిత్రి, సీత—వాళ్ళ పేర్లనూ వాళ్ళ సంభాషణనూ పోలికలు చూసుకోవటంతో కాలక్షేపం అయింది.

సాయంత్రం మామూలుగా ఆఫీసు మూసేసే టైమ్‌కు యింటికి చేరుకున్నాడు విశ్వనాధం. అతన్ని చూడగానే లోపలికెళ్ళి కాఫీ పట్టు కొచ్చింది పార్వతి. తిరిగి యెలా శాంతి నెలకొల్పాలా అని మార్గాలు అన్వేషిస్తున్నది. కాఫీ గ్లాసు టేబుల్ మీద పెట్టి "ఏమండీ!" అని పలకరించింది మొహంనిండా నవ్వు తెచ్చుకొని.

అంతే. మరుక్షణంలో పార్వతిని ఫెడీమని తల తిరిగిపోయేలాగ లెంపకాయ కొట్టాడు విశ్వనాథం.